# కన్నె ఉగాది!

ఆరోజు ఉగాది.

అది నా జీవితానికే నవయుగాది.

ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా నే కన్నకలలు నా కళ్ళ ముందు కదలాడుతూంటే, ఆ మధుర స్మృతిలో మరపురాని మహదానంద ముదయించి, నాలో ఆశాలతలు చిగురించి కోరికల కుసుమాలు వికసించి, ఆనంద పరిమళ మరీచికలు సురభిళించిన శుభదినం. పదహారు వసంతాలు నిండిన నాలో, ఆనాడేవో మధుర భావాలు తలఎత్తి పూర్వం ఎన్నడూలేని ఒకానొక దివ్యానుభూతిని కల్గిస్తున్నాయి.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. దొడ్లో కొత్తగా పూచిన గున్నమామిడి, లేతచిగుళ్ళను మెక్కుతూ, తియ్యగా గొంతు సవరించుకొంటూ గండుకోయిల నవయుగాదికి స్వాగతం పలుకుతోంది. దాని కేకకు ఉలికిపడి నిద్రనుంచి లేచాను. నా తత్తరపాటుకి శ్రుతిగా మెళ్ళోఉన్న, మంగళ సూత్రాలు దివ్యమంగళ స్వరంతో నన్ను పరవశింప చేశాయి, మాంగల్యాన్ని కళ్ళకద్దుకుని కళ్ళువిప్పాను. నా చుట్టూ ఉన్న పరిసర ప్రాంతమంతా వసంత పులకాంకితమై కనిపించింది.

ఆయన రాత్రనగా వచ్చారు. పలకరించడం మాట అటుంచి ఆయనకు కనిపించడానికైనా వీలుచిక్కలేదు నాకు. ఆయన్ని అన్నయ్యా, నన్ను ఒదినా సి.ఐ.డిల లాగా అనుక్షణం కాపలా కాస్తూ, ఒక్క క్షణంకూడా వదలలేదు.

డాబా మీద ఆయనకు పక్కవేసి, ఆ పక్కనే తన పక్క వేయించుకున్నాడు అన్నయ్య. ఎవరూ చూడకుండా వెళ్ళి మాట్లాడాలనుకుంటే ఏకాంతం చిక్కలేదు. కోపం వచ్చిందో ఏమో, తొందరగా వెళ్ళి ఇప్పుడేనా పలకరించాలి.

అమ్మ నాకు తలంటి వదులుగా జడ అల్లి విరిసిన మల్లెలు ముడిచేటప్పటికి, ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అప్పటికే నాన్నగారు పొలం వెళ్ళారు. అన్నయ్య దొడ్లో వేపపువ్వు, మామిడికాయలూ కోయించే హడావిడి విన్పిస్తోంది. ఆయన ఇంకా నిద్రనుంచి లేచినట్లులేదు.

ఇంతకంటే ఏకాంతం నాకు దొరకదు.

తియ్యని తొందరపాటు, హృదయంలో తత్తరపాటూ నన్ను విచలితను చేస్తూంటే,

ఎర్రని పట్టు పావడా, తెల్లని పైట కండువా, లేత నీలపురంగు జాకెట్టు వేసుకొని, పదే పదే అద్దంలో చూసుకుని, నుదుట బొట్టు సరిదిద్దుకుని, చెంపని సుతారంగా తాకుతూన్న ముంగురుల్ని సవరించుకుంటూ, తడబడుతూన్న కాళ్ళతో డాబా మెట్లవైపు బయలు దేరాను.

ఉన్నట్టుండి వెనుకనుంచి - "ఎక్కడికమ్మా ఓ వసంత సుందరీ" అని కేక వినిపించేసరికి, ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను....

వదిన! .... నవ్వుతూ కొంటెగా చూసింది.

దొంగతనం చేసినదానిలాగ చట్టున సిగ్గుపడి, ఆగిపోయాను, ఒళ్ళంతా కుంచించుకు పోయింది.వెనక్కు తిరిగాను.

వెంటనే ఒదిన "అహహ!.... ఇటుకాదు దారి..... అటు... అటు... వెళ్ళు" అంది.

"అక్కరలేదు అటు వెడుతూంటే, నువ్వు శకునం వచ్చావుగా?" అన్నా కోపంగా.

"అందుకే వెనక్కు తిరగొద్దు అంటున్నా-మంచి శకునం వస్తూంటే మరలిపోతారేమిటి ఎవరేనా."

"మరేం చెయ్యమంటావు?"

"నీ ప్రయాణం సఫలం అవుతుంది -మంచి బహుమతీ ఇవ్వమంటాను, నీతో మాట్లాడుతూ కూచుంటే పండగ పనులు అయినట్టే వస్తా" అంటూ వెళ్ళిపోయింది ఒదిన సీరియస్‌గా....

నేను కొంచెంసేపు తటపటాయించి, అదురుతున్న క్రిందపెదవిని పై పంటితో నొక్కి, డాబా మెట్లు ఎక్కనారంభించాను.

నా మనస్సుకి అవి ఏమిటో, చాలామెట్లు ఉన్నట్లు అనిపించాయి. ఎంతకీ తరగవు. స్వర్గపు నిచ్చెనమెట్లు లాగ, తొందరగా వెళ్ళాలనే ఆత్రంతో గబగబా డాబా మీదకు వెళ్ళాను.

దూరాన భావనారాయణ దేవాలయంలో ఉన్న ధ్వజస్థంభం చివర చిరుగంటలు మందమారుతానికి కదిలి రతీమన్మధుల కాలిగజ్జెల మోహన రవళిగా వినిపించ సాగాయి. ఆకాశం చుక్కలు అద్దిన తననల్లటి మేలిముసుగుని తీసివేసి స్వచ్ఛమైన ధవకాంశుకాన్ని ధరించబోతోంది.

ఎక్కడనుంచో స్వచ్ఛమైన స్వరంలో పురుష సూక్తపఠనం వినవస్తోంది.

మెల్లగా, మెలమెల్లగా అడుగులు వేసుకుంటూ దడ దడ కొట్టుకునే గుండెతో వెళ్తే తెల్లని మల్లిపువ్వులాంటి పక్కమీద మహారాజులా పడుకున్నారు. ముఖంలో ఎంతో ప్రశాంతత, మరెంతో నిశ్చలతా, గంభీరంగా కనిపిస్తున్నాయి. ప్రత్యూష పవనాంకురములు ఆయన ఉంగరాల జుట్టుతో ఆటలాడుకుంటున్నాయి. నా హృదయం తియ్యని బరువుతో, నా మనస్సు బలమైన అనుభూతితో నిండిపోయింది. అలా ఎంతసేపు నిలబడ్డానో నాకే తెలియదు.

గాలికి చెదిరి కళ్ళమీద పడుతూన్న ఆయన జుట్టుని మెల్లగా మృదువుగా సర్దబోయాను.

"ఎవరూ?" అంటూ ఉలిక్కిపడి లేచారు ఆయన.

కంగారు పడ్డాను నేను. వెంటనే సిగ్గు ముంచుకొచ్చేసింది. మెదడు ఒక్కక్షణం పనిచెయ్యడం మానేసింది. అలాగే ఉండిపోయాను.

"నువ్వా?" అన్నారాయన ఆశ్చర్యపోతూ, నేను తలవంచుకున్నాను.

ఆయన అటూ ఇటూ చూసి నా చేయి పట్టుకున్నారు.

ఆ పాణిగ్రహణానికి మంగళ స్వరం లాగ "కుహు" అని కూసింది కోయిల. నేను త్రుళ్ళిపడ్డాను.

ఆయన పక్కున నవ్వి "కోయిలా? ఇంకా నీవనుకున్నాను" అన్నారు. నా ముఖం ఎర్ర గులాబీ అయింది.

"అతిధి రాత్రి అనగా వస్తే శ్రీమతి దర్శనం ఇప్పటికా" అన్నారు.

"మరి మన ఇద్దరిమధ్యా కొన్ని సాంఘికమైన అడ్డులు ఉన్నాయికదా?" అన్నాను.

"అయితే పండక్కు తప్పకుండా రావాలి. వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తాను అంటూ ఉత్తరాలు సూటిగా గుండెల్లో గుచ్చుకునేలా రాయడానికి ఏ అడ్డంకులూ లేవా?" అన్నారు. యూనివర్శిటీ చదువులు అయేదాకా ఈ అడ్డంకులు కావాలని మీరు నిర్ణయించినవేగా?" అన్నాను.

"ఈ పండగకు రారేమోనని ఎంత భయపడ్డానో తెలుసా?" అన్నాను.

"ఈ కోయిల కూస్తే, ఈ వసంతుడు రాకుండా ఉండగలడా?" అంటూ బుగ్గమీద మీటారు.

"నేను ఉగాదికి వస్తున్నట్లు రాస్తే, మీ అన్నయ్య ఏం జవాబురాశాడో తెలుసా? ఈ ఉగాది పండగ అల్లుడువచ్చే పండగ కాదోయి? అంటూ" బహుశ పరీక్షలు ముందరకదా

అని. నేను వస్తే మళ్ళీ తొందరగా నిన్ను ఒదిలివెళ్ళనేమోనని రావద్దని రాశాడు. అయినా నేను రాకుండా ఉండగలనా? ఈ పసిడి మామిడి తోటనడుమ, కోకిల మంజుల గానాల మధ్య కలస్వనంతో ప్రవహించే నదీతీరాన ఈ డాబా మీద స్థిరసౌదామినీ వంటి నీ ప్రక్కన ఉండి ఉగాదిని గడవడం కంటే నాకు కావలసిందేముంది?''అన్నారు "అబ్బో...అబ్బో....... అబ్బాయిగారికి కవిత్వం వస్తోందే! అటు చూడండి లేత చిగురుటాకుల వల్లెవాటులు ధరించి ముగ్ధ మోహనమై నిలుచున్న గున్నమామిళ్ళూ, వాటిపై కూచుని కొంటెగా కూస్తూ అందర్నీ కవ్విస్తూన్న గండు కోకిలలూ, హృదయానికి గిలిగింతలు పెడుతూన్న పక్షుల కలకలలూ నా హృదయం కోరికల రెక్కలు ధరించి ఏలోకపు సౌఖ్యాలకో ఎగిరిపోతోంది" అన్నాను.

"వయస్సుని మరిపించే తియ్యని కోరికలూ మధుర భావాలూ మనజీవిత సామ్రాజ్యాన్ని కలకాలం పరిపాలించాలి. అందుకు ఈ ఉగాదే నవయుగాది కావాలి మన జీవితానికి" అంటూ ఆయన నన్ను దగ్గరగా తీసుకోబోతూంటే...

"నవదంపతులకి మా ఉగాది శుభాకాంక్షలు" అంటూ అన్నయ్యా, ఒదినా డాబామీదకి వచ్చారు.

అంతే... నేను ఉలిక్కిపడ్డాను,

"ఎవరూ, ఏమిటీ" అంటూ కళ్ళు తెరిచాను.

ఒదినా, అన్నయ్యా, పక పక, నవ్వుతూ, "ఏమిటా పలవరింతలు? ఉగాది పూటా ప్రొద్దెక్కి లేస్తావా? ఈ రోజు నిన్ను చూసుకుందుకి పెళ్ళివారు వస్తారు" అంటూ ఒక్కసారిగా అన్నారు.

"అయితే, ఇప్పటి దాకా కలలో జరిగినదే?" అన్నాను.

"నీ కలలు నిజమయే రోజు ఈ రోజు" అంది ఒదిన, నా మనస్సులో ఉన్నది కనిపెట్టినట్లు, నిజంగా ఈ ఉగాదినాటి కన్నె కల నిజమై నా జీవితానికి ఇది నవయుగాదియై, నే కలగన్న మధురమూర్తి కనిపిస్తాడా?

❄❄❄

(ప్రగతి వీక్లీ 1976)